# దీపం ఉండే చీకటూ!

★

రాళ్లపల్లి సదాశివశర్మ

(బదరీ నాథ్‌కు వెళ్లి దేవుని అనుగ్రహంతో సంతానాన్ని పొందాలని నిశ్చయించింది పార్వతి. కాని అనుకోకుండానే ఒకగడ్డు సమస్య ఎదురైంది. తన ప్రేమపై ఎంతో నమ్మకము పెట్టుకున్న గోపీని ఏంచేయాలి?)

• • •

వీధిలో పిల్లలు కొట్లాటలో దయతలచి కాపాడిన కుర్రవాడే తనకొక సమస్యగా పరిణమిస్తాడని కలలోకూడా అనుకోలేదు పార్వతి. సంతానం కొరకు దేవుణ్ని ప్రార్థించేందుకు భర్తతోబాటు ఆవూరు వచ్చింది. దేవాలయంలో నుండి బయటికి వస్తూవుంటే యీ విషాద దృశ్యము చూసింది. ఇరవై ఏళ్లవాడు ఎనిమిదేళ్లకుర్రవానిపై కూర్చునియిష్టమువచ్చినట్లు కొడుతుండటం చూసే సరికి పార్వతి హృదయము రెపరెపకొట్టుకుంది. ఎంతోమంది పోగై ఈ"తమాషా" చూస్తున్నారు. అసమాన కొట్లాటను ఎంతో మంది ప్రోత్సహిస్తున్నారు గూడ. బలించాలని కుర్రవాడు క్రిందబడి వూపిరి పీల్చేందుకు గిజగిజలాడి పోతున్నాడు. సానుభూతి పరులంతా ఎవరి త్రోవనవారు వెళ్తున్నారు. కాని పార్వతి మాతృ హృదయము మాత్రం తపించి పోయింది. స్త్రీత్వము అంటే మాతృత్వమన్నమాట— ప్రేమ వాహిని అక్కడే ఉద్భవిస్తుంది—అక్కడే అంత మొందు తుంది. తన హృదయపు శకలమే ఎలిగి, నశిస్తున్నట్లు వాపోయింది పార్వతి. "అయ్యో! పాపం వాణ్ని చంపేస్తున్నాడండీ!" అని అనకుండా వుండలేక పోయింది.

ఆమె భర్త శేఖర్ తక్షణము జనసమూహంలో చొరబడి పైన కూర్చున్న యువకున్ని లేవనెత్తి, ఆ చెంప యీ చెంప వాయించాడు."వెధవా! పోలీసులకు పట్టిస్తా,, అనేసరికి పారిపోయాడువాడ.

కుర్రవాడు లేచి దుమ్ము దులుపు కొంటున్నాడు ఏడుస్తూ. మొదటే చిరిగిపోయిన చొక్కా ఎరీ తునాతునకలై పోయింది. నోట్లోనుంచి రక్తం గూడ కారుతోంది. పార్వతి మెల్లగా దగ్గర కెళ్ళి భుజంపై చేయివేస్తూ "ఇలా రా బాబూ! ఏడ్వవద్దు లే యిక. నీపేరేమిటి అని అడిగింది.

"గోపి! అని ఏడుస్తూ చెప్పాడు కుర్రాడు.

"పరేలే గోపీ ఇక ఏడ్వవద్దు బాబూ! అయినా ఆదున్నపోతు ఎందుకలా కొడుతున్నాడు? నాయనా

ఏడ్పు మానలేక పోయాడు గోపి,ఏడుస్తూనే,

"మరండీ, దేవళంలో ప్రసాదం పంచి పెడుతుంటే నేను ముందుకెళ్లి నిలబడ్డానని చావ గొట్టాడండీ,, అని చెప్పాడు.

"అవునులే బాబూ! దేవాలయాల్లో ప్రసాదం పెద్దమనుషుల యిళ్ల కెళ్లకుండా నీ కెలా దొరుకుతుంది? పోనీలే. వాణ్ని మావారు బాగా కొట్టారులే. ఇక ఆకొళాయిదగ్గర ముఖంకడుక్కో ప్రసాదం నేబెడతాలే. చూడు! నోట్లోంచి రక్తం కూడ వస్తోంది అంది పార్వతి.

ప్రసాదం మాట వినగానే గోపి మొహం విప్పారింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి ముఖం, చేతులు కడుక్కొని వచ్చాడు. పార్వతి ప్లేటునిండా ప్రసాదం పెట్టి గోపికి యిచ్చింది. గబగబ తినేశాడు గోపి. తినేలోగా భార్యాభర్తలు తాము దిగిన ధర్మశాలకు వచ్చేశారు. తమగది తలుపు తెరుస్తూ వెనక్కి చూస్తే గోపి నిలబడ్డాడు.

"ఓ! నువ్వా!,,అన్నారిరువురూ.

"అవునమ్మా నేనే! ఈరోజు నన్ను మళ్లీ వాళ్లు చూశారంటే చంపకుండా వదలరు,,— అన్నాడు.

పార్వతి గదిలోకి వెళ్లి వంట ప్రయత్నాలు ప్రారంభించింది. ఇంకేమీ పనిలేక పోవటంతో శేఖర్ మంచంపై కూర్చొని సిగరెట్టు పెట్టె బయటికి తీశాడు. కాని అప్పుడు గాని జ్ఞాపకం రాలేదు సిగరెట్లు అయిపోయినది. రూపాయినోటు గోపీ చేతిలో బెడుతూ "బెర్క్లీ ప్యాకెటు,,తెమ్మన్నాడు. వాడలా వెళ్లగానే అనమాన పడ్డాడు శేఖర్.

"పార్వతీ! వాడా రూపాయితో ఉడాయించడుగా! అన్నాడు.

"నేనలా అనుకోనండీ! చూస్తే మంచి అబ్బాయి లాగున్నాడు,, అంది పార్వతి.

అన్నట్టుగానే సిగరెట్టుడబ్బాతో తిరిగివచ్చాడు గోపి. మిగిలిన డబ్బులు శేఖర్ చేతిలో పెట్టాడు.

పార్వతి వంటపూర్తిచేసి భర్తకు వడ్డించింది. భర్త భోజనము చేయగానే గోపీని పిలిచింది. విస్తరి ముందు కూర్చున్నాడుగోపి.

"వెధవా! ఆపాడు చేతులతో అలాగే కూర్చోవటమే. వెళ్లి చేతులు కడుక్కొనిరా. భోజనానికి ముందు ఎప్పుడూ శుభ్రంగా వుండాలి చేతులు. తెలిసిందా? అంటూ పార్వతి మందలించే సరికి చేతులు కడుక్కొని వచ్చి భోజనం చేశాడుగోపి. ఏదో అంతా వింతగా కనిపించింది వాని కళ్లకు. ఏదో కొత్త అనుభూతిని పొందింది అచిన్న హృదయము.

భోజనాల తర్వాత యింటిపని పూర్తి చేసుకొని స్త్రీల"పతివ్రతల కథలు"చేతిలో పట్టుకొని కూర్చుంది. శేఖర్ తన ధూమపాన మేఘాల్లో తేలియాడు తున్నాడు. కొంచెంసేపటికి పార్వతి ఆపుస్తకం మూసివేస్తూ గోపీవైపు పరీక్షగా చూసింది.

"అయితే గోపీ! నీవెక్కడ వుండటం?,, ప్రశ్నించింది పార్వతి:

గోపీ దాదాపు పదిస్థలాలు చెప్పాడు—సినిమా హాల్సు, పార్కు, బజారు, దేవాలయము,యింకా, యింకా..................

"ఎందుకు ? నీకు యిల్లు లేదా బాబూ? మీ అమ్మ ఎక్కడుంది?"

గోపీ ఆకాశం వంక చూపించాడు.

"అంటే?మీ అమ్మ చనిపోయిందా? ఎప్పుడు చనిపోయింది?,,

"చాల కాలమైందండీ?"

"పాపం! తల్లిలేని పిల్లవాడివన్నమాట. మీ నాన్న ఎక్కడున్నాడు యిప్పుడు?,

"నాకు తెలియదమ్మా ! అమ్మ చచ్చిపోక ముందే ఎక్కడికో వెళ్లి పోయాడట.,,

"పాపం! ఇక దేవుడే నీకు దిక్కన్న మాట,, పార్వతి మనసులో ఎంతో బాధపడింది. భగవంతున్ని కాసేపు తూలనాడింది. తమ ప్రేమ శిఖరాల్నే, తమ హృదయపు తునకల్నే తమకు కాకుండా చేసు కుంటారు. కొందరు తన లాంటి వాళ్లకు ఒక నలుసునైనా ప్రసాదించడే దేవుడు.

ఇంతలో ఎవరో సగముకాల్చి రోడ్డుపై వేసిన సిగరెట్టుకై పరుగెత్తు కుంటూ వెళ్ళాడు గోపి. దాన్ని నోట్లోపెట్టు కుంటుంటే తీసి పారేసి ఒక్కటి కొట్టింది పార్వతి.

"వెధవా! అప్పుడే సిగరెట్టు అలవాటుకూడానా! ఛీ,ఛీ! ఎవరో కాల్చి పారేసిన సిగరెట్టును నీవు నోట్లో పెట్టుకోవటమా? అవతలికి వెళ్ళు అంటూ ముక్కు మూసు కుంది పార్వతి.

సిగరెట్టు పీక పారేసి చేతులు కడుక్కొని భయంతో పార్వతి దగ్గరికి వెళ్లాడు గోపి, ఏడుస్తూ.

"అమ్మా! చెంపలేసుకుంటున్నా, ఇంకెప్పుడూ త్రాగనమ్మా సిగరెట్టు. నన్ను క్షమించవూ,, అంటూ చూచాడు.

ఆర్ద్రనయనాలను చూస్తూ పార్వతి,కొట్టినందుకు మనసులో తన్ను తాను ఎంతో నిందించుకొంది తలనిమురుతూ,

"నీవెప్పుడూ సిగరెట్టు కాల్చ కూడదుబాబూ అంది.

"బీడీలు కాల్చవచ్చా? అమ్మా'..



పూజకు ....

"బీడీలు వద్దు, సిగరెట్లు వద్దు. అవన్నీ చెడ్డవే,,

"అయితే, అమ్మా! మరి చిన్నాన్నగారు ఎందుకు కాలుస్తారు?" అనిగోపి భయంతోఅడిగే సరికి, శేఖర్ ఇటువైపు తిరిగి, చిరునవ్వుతో,

"తుంటరి వెధవా! అప్పుడే నన్ను విమర్శించేంత వరకు వచ్చావన్న మాట. అయినా నేను పెద్దవాన్ని, నీవు చిన్నవాడివి, తెలిసిందా?,, అన్నాడు. పార్వతిఒక్కసారి భర్త కళ్లల్లోకిచూసి,

"చెడ్డకి పెద్దా, చిన్నా తారతమ్యమేమిటి? గోపీ! నీవు యిలాంటి చెడు అలవాట్లు చేసికో గూడదుబాబూ! నీవొక మంచి మనిషిగా తయారవ్వాలి. అర్థమైందా?,, అంది.

"త్రాగటం ఎందుకు చెడ్డదమ్మా?" గోపీ అమాయకంగా ప్రశ్నించాడు.

పార్వతి ఏదో ఫస్టుఫారం వరకు చదివింది. సీటిపై తర్క వివాదాలు చేసేటంత చదువు కాదది. మనిషికి కావలసింది విద్య, విజ్ఞానం గాని డిగ్రీలు కాదని ఆమె అభిప్రాయం "ఎందుకు?, అన్నదానికి జవాబు లేక పోయింది ఆమె దగ్గర. ఈ ప్రపంచంలో కొన్నివస్తువులు మంచివి, కొన్ని చెడ్డవి. అంతే ఆమెకు తెలిసింది.

"అదిచెడ్డది. అంతే! నన్నిలాంటి వెధవప్రశ్నలతో చంపుకతినొద్దు" అంటూ చికాకుగా అంది పార్వతి.

"సరేనమ్మా!" అంటూ ఓమూలకూర్చున్నాడు గోపి. తన తల్లిఆదేశించినట్లు మంచివాడుగా ఎలా తయారవ్వాలా అనియోచిస్తూ.

మధ్యాహ్నం ఆ ధర్మశాలలో పార్వతి స్థితి విని అంతా జాలిపడ్డారు. పార్వతి తానుచేసిన వ్రతాలన్నీ ఏకరువుపెట్టింది. తిరిగిన యాత్రా స్థలాలన్నీ ఒక్కటీ మరువకుండా చెప్పింది. చివరికి శేఖర్ నలుగురు దేవాంశ సంభూతులని ప్రసిద్ధి చెందిన జ్యోతిష్కుల వద్ద నాలుగు సంతాన కవచాలు తెచ్చియిచ్చినా ప్రయోజనం కలుగలేదన్నది.

"పెళ్లిలయి ఎంతకాలమయిందమ్మా?" అన్నారు ఒకరు.

"ఏడేళ్లు" అంది పార్వతి.

అందరూ మరొక్కసారి "అయ్యోపాపం!" అన్నారు. ఆ వూరు ఎందుకు వచ్చింది పార్వతి.

"ఈ వూర్లో ఒక సాధువు వున్నాడని విని వచ్చానమ్మా" అంటూ చెబుతూంటె తనబాధ కొంతమరచి పోయింది పార్వతి.

"ఏ సాధువమ్మా?—ఆగుడిదగ్గర వున్నతనేమి? అతడేం పనికిరాడమ్మా. అతని మంత్రాలు వట్టిబూటకాలు. నాకు తెలిసినఎంతోమంది అతని దగ్గరసిద్ధిపొందారు. కాని లాభంలేకపోయింది.—వట్టిడబ్బుఖర్చుతప్ప."

మళ్లీ తనఆశలన్నీ చిందరవందరయ్యాయి సంతానమహిమ అతనిలో ప్రసాదించనుమని ఒకసారి భగవంతుణ్ణికోరింది.

ఇంతలో ఒకావిడ సలహానిచ్చింది. "అయినా మీ దగ్గర వాళ్లఅబ్బాయి నెవరైనా పెంచుకో కూడదు?" అని.

"ఆc అయినా యింకా వయస్సుపోలే లేదులే. ఆశలన్నీ విడిచిపెట్టేందుకు. దేవుడు ఎప్పటికైనా దయ తలచవచ్చు. జాతకంలో సంతాన యోగమున్నదని ఆమేచెబుతూంది" ఎవరో పార్వతివైపు ధైర్యమిచ్చారు.

అన్నట్లు మీరు 'సంతానేశ్వరానికి, వెళ్ళారా?' అడిగింది వకామె.

"లేదు" అంది పార్వతి.

"చాల తప్పుచేశావమ్మా. ఎంతోమంది నీలాంటి వాళ్ళ కడుపులు ఫలించాయి. వాళ్ళు ఆదేవున్ని సంతాన కామేశ్వరుడంటారు"

అందులో ఒకామె, బహుశ అక్కడికి వెళ్లి వచ్చిందేమో, అక్కడి ఆచారవ్యవహారాలు పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

"వేకువజామున్నే నిద్రలేచికోనేట్లో స్నానం చేయాలి. ఆ తడిబట్టలతో ఆలయంలో సాయంత్రం వరకూ వుండాలి. ఇలా మూడురోజులు చేశావంటె దేవుడు నీకు స్వప్నంలో కనిపిస్తాడు. ఆ స్వప్న ఫలితాన్నినీవు పదిహేనురోజుల్లో చూస్తావు" అంది.

సంతానేశ్వరము పార్వతి మనస్సులో నాటుకుపోయింది. తానిన్ని రోజులు అక్కడికి వెళ్ళనందుకు ఎంతో విచారించింది. శేఖరుకూడా ఒప్పుకున్నాడువెళ్లేందుకు. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు.

గోపి మెల్లగా పార్వతి దగ్గరికి వచ్చికూర్చుని, "అయితే అమ్మా! నీకు పిల్లలు లేరా?" అని అడిగాడు.

పార్వతి కన్నీళ్లతో గోపివైపు చూసింది.

"ఏడ్వవద్దమ్మా! నీకు తప్పకుండా కొడుకు పుడతాడు. దేవుడు యోగిరూపంలోనో, బ్రాహ్మణ రూపంలోనో వచ్చినీకొక పండుయిస్తాడు. అది నీవుతింటే కొడుకుపుడతాడుకదమ్మా?"

నవ్వకుండా వుండలేకపోయింది పార్వతి.

"గోపీ! ఇవన్నీ నీకెవరుచెప్పారు?" అంది.

"నేనివన్నీ కథల్లోవిన్నానమ్మా. సినిమాల్లో కూడా చూశాను" జవాబిచ్చాడు గోపి.

ఆరోజు సాయంత్రముఊరు చూడాలనుకున్నారు దంపతులు. ఎడ్లబండి ఏర్పాటుచేశాడు శేఖర్. గోపిబండివాని ప్రక్కన కూర్చుని అన్నీ వివరించిచెబుతున్నాడుపార్వతిశేఖరులకు. ఆవూళ్లో ఒక సర్కసు ఆడుతూంది. దాన్ని గురించి, ఆ గుర్రాలు, ఏనుగులు, పులులు, అన్నిటినీ ఒక గంటసేపు వర్ణించాడు గోపి. కాని వాని ప్రయాసంతా వ్యర్థమైంది. "అదిచూస్తే పుణ్యమా? పురుషార్థమా?" అంది పార్వతి. చివరికి అందరూ "గణేష్‌మహిమ" సినిమాకివెళ్లారు.

శేఖర్ నాల్గణాలు గోపీచేతుల్లో పెట్టిమూడవ క్లాసులోపోయికూర్చోమన్నాడు. కాని గోపిమనసులోసర్కస్‌దృశ్యాలు మెదిలాయి. వాళ్ళిద్దరూ అలా సినిమాలోకిపోగానే సర్కస్‌కెళ్లి సినిమా విడిచేటోగా తయారయ్యాడు గోపి.

ఎందుకో పార్వతికి అనుమానం వేసింది.

"నీవుథియేటరులో వున్నావా? గోపీ!" అని అడిగింది.

"అవునమ్మా! మీరూ, చిన్నాన్నగారూ ఎక్కడ కూర్చున్నారోకూడ చూశాను. అన్నాడు బెదురుగా. కాని ఆదే ప్రశ్నమళ్లీ పార్వతి వేసేసరికితప్పు ఒప్పుకోకతప్పలేదు గోపికి.

"అదితప్పుగాదూ? గోపీ! అబద్ధం ఆడొచ్చా ంది.

"మరి సర్కస్ చూడాలనిపించిందమ్మా! చెంపలేసుకుంటున్నాగా. ఇంకెప్పుడు అబద్ధం చెప్పను సరా!" అని అలా యిలా ఆమెతో "సరే. పోనీలే" అనిపించాడు.

మరురోజు సంతానేశ్వరానికి ప్రయాణమయ్యారిరువురూ. గోపి స్టేషనుదాకా వెళ్లాడు. పార్వతి గోపిచేతిలో ఒకరూపాయిపెడుతూ మంచివాడుగా వుండు నాన్న!"అంది. గోపి కళ్లల్లోనీళ్ళు నిలిచాయి. వానికి తెలియకుండానే వాని శరీరము వానికే బరువు అనిపించింది.

పార్వతికికూడా ఏదోవస్తువును పోగొట్టుకున్నట్లనిపించింది. ఆ ముష్టి కుర్రవానిపై తన జాలి, ప్రేమలకు ఆశ్చర్యపడింది. రైలు రాగానే, చాల జనసమ్మర్థంగా వుండటమువల్ల త్వరత్వరగావెళ్లి కూర్చున్నారు సీట్లపై. రైలు కదిలింది. కొద్దిసేపటికి ఆ సమూహంలో ప్రయాణికుల కాళ్లక్రింద చూశారు గోపిని.

"ఇక్కడా తయారయ్యావు?" అన్నారు యిద్దరూ.

"అవునమ్మా! చిన్నాన్నగారు! నేనూ మీవెంట సంతానేశ్వరానికి రావాలనుకున్నా. ఇక్కడుంటే నాదగ్గరున్న రూపాయి కాస్తా లాగుకుంటారమ్మా" ఒప్పించేటట్లు చెప్పాడు

"సరే! టిక్కెట్టు తెచ్చుకున్నావా?"

తెచ్చుకున్నానందామనుకొన్నాడు, కాని మళ్లీ "అబద్ధం యింకెప్పుడూ ఆడనమ్మా!" అని చెప్పింది జ్ఞాపకానికి వచ్చి భయంగా చూశాడు యిద్దరివైపూ.

"ఎక్కడో తుంటరి పిల్లకాయ" అనుకున్నారిరువురూ.

అకస్మాత్తుగా ఒక టి. టి. ఐ. పెట్టెలోకి వచ్చేటప్పటికి ముచ్చెమటలుపోశాయి గోపికి. సీటుక్రింద దూరి దాక్కున్నాడు. టికెట్లన్నీ చెక్ చేసి వెళ్తున్న వాడల్లా వెనక్కితిరిగి సీట్లక్రిందచూస్తే గోపీ కనబడ్డాడు. చెయ్యిపట్టిబయటికి యీడ్చాడు "రాస్కెల్! ఈ రైలు నీ బాబుగాడి దనుకొన్నావా?" అంటూ ఒక్కటేశాడుచెంపపై.

పార్వతికి తన చెంపపై పడినట నిపించింది. ఆ దెబ్బ.

"పాపం! ఏదో పిల్లవాడులెండి!" అన్నారు పార్వతీ శేఖరులు.

"అలాకాదుసార్! ఇల్లాంటివాళ్ల మూలంగానే కోటిరూపాయలకుపైగా నష్టము వస్తుంది" అన్నాడు టి. టి. ఐ.

"అవును మరి, ఘరానా పెద్దమనుష్యులుపోగా లేనిది పాపం, ఆ కుర్రవాడుపోతే నష్టమువస్తుందన్నమాట, మన గవర్నమెంటుకు"అంది పార్వతి కోపంపట్టలేక.

"అయినా తెలియక అడుగుతా మీకేమీ సంబంధంలేని ఆ పిల్లవానిపై మీకెందుకంత అభిమానం?" అందరివైపూ చూస్తూ అన్నాడు టి. టి. ఐ.

ఒక చిన్నస్టేషనులో రైలు ఆగింది. గోపీని ప్లాటుఫారంపై త్రోశాడు టి. టి. ఐ.

"సార్! ఈ రూపాయి తీసుకుని నన్నువదిలేయండి. అంటూ ఏడ్చాడు గోపి.

"రాస్కెల్! నాకు లంచంయిస్తున్నావా?" అంటూ బూటుకాలితోతన్నాడు. ఇక ఆ హృదయ విదారక దృశ్యం చూడలేకపోయింది. పార్వతి. "ఏమండీ?" అంది శేఖరంతో.

శేఖరు రైలు దిగి వెళ్లి టిక్కెట్టు డబ్బులిచ్చి గోపీని రైలు ఎక్కించాడు. పార్వతి హృదయం కుదుటబడింది. మళ్లీ ఎప్పటి ముసిముసినవ్వుతో తయారయ్యాడు గోపి.

* * *

సాయంత్రానికల్లా సంతానేశ్వరము చేరారు ముగ్గురు. సత్రంలో శేఖర్ ఎప్పటిలాగ చాప పరచుకొని సిగరెట్టుతీశాడు బయటికి రాత్రికి వంటప్రయత్నాల్లోవుంది పార్వతి. గోపి ఎక్కడికో బయటికివెళ్లి అర్థగంటలో చేతిలో ఒకకాగితపు పొట్లంతో తిరిగివచ్చాడు. పాతబట్టలకొట్లో ఒక షర్టు, నిక్కరు తెచ్చుకున్నాడు. అలాగేవస్తూ ఒక సూది, దారము తెచ్చుకుని ఒక మూలకు కూర్చుని అంగీ చిరుగులు కుట్టుకుంటూ పాడుకుంటున్నాడు ఏదో. వంటపూర్తిచేసి బయటికి వచ్చిన పార్వతి చూసింది గోపిని.

"ఏంటే? గోపీ!" అంది.

"ఇవి బాగా లేవా! అమ్మా! అంటూ తెచ్చిన బట్టలు తీసి చూపించాడు.

"ఎక్కడ దొంగిలించావు?" అంది కోపంగా.

"లేదమ్మా! మీరు యిచ్చిన రూపాయితో తెచ్చుకొని, చిరుగులు కుట్టుకుంటున్నా"

"సరే అవి అలా వుండనీ. నేకుట్టేస్తాలే. సూది గ్రుచ్చుకుంటే మళ్లీ అదొక గొడవ. నీవెళ్లి చేతులు, కాళ్లు కడుక్కురా వంట తయారైంది."

గోపి కొళాయి దగ్గరకు వెళ్లి కాళ్లు చేతులు కడుక్కొని వచ్చాడు. పార్వతి కుట్టి యిచ్చిన బట్టలు వేసుకుని ఎంతో మురిసిపోయాడు గోపి. సంతోషం పట్టలేక.

"అమ్మా! నేనిప్పుడు అందంగా లేనా?" అన్నాడు గోపి.

పార్వతి అప్పుడు చూసింది పరీక్షగా. నిజంగా ముద్దులు మూట కట్టుతున్నాడు గోపి.

"నాకే ఒక కొడుకు వుంటే వానికి బట్టలు వేయుటంలో ఎంత ఆనందం పొందేదాన్నో అంటూ ఆనంద బాష్పాలు రాల్చింది. పార్వతి మెల్లగా భర్త దగ్గరకు వెళ్లి.

"ఏమండీ! గోపీకి రేపు కొత్తబట్టలు తెచ్చిపెట్టరూ?" అంది గోముగా సరేనన్నాడు శేఖర్. ఆరాత్రి భర్తతోపాటే గోపీకి భోజనం వడ్డించింది.

వేకువజామున్నే ముగ్గురూ ఆలయానికి వెళ్లారు. పార్వతి కోనేట్లో స్నానం చేసి ఆలయంలో ఒక మూల తడి బట్టలతో కూర్చుంది. శేఖర్, గోపీ ఇరువురూ పూరి మీద బడ్డారు. రాత్రికి సత్రంకి తిరిగి వచ్చేటప్పటికి పార్వతి వంట చేస్తూవుంది.

"ఏమమ్మా! కలలో దేవుడు కనబడ్డాడా?" ఆతృతగా అడిగాడు గోపి.

"అంత తొందరైతే ఎలా బాబు?" అంది పార్వతి.

భోజనాల తరువాత గోపి పలకా బలపంతో పార్వతి ప్రక్కన కూర్చున్నాడు.

"చూడమ్మా! యీ రోజంతా నేను ఓనమాలన్నీ నేర్చుకున్నా. చిన్నాన్నగారు నేర్పించారు. ఇలా చూడు! మరి! నీపేరు, చిన్నాన్న పేరు వ్రాస్తా"నంటూ పార్వతి గడ్డం పట్టుకుని పైకెత్తాడు.

"పారూ! వాడీరోజు నన్ను చంపుకుతిన్నాడంటే నమ్ము. ఒక్క క్షణం కూడా విశ్రాంతి యివ్వలేదు. అన్నాడు శేఖర్.

ఇంతలో గోపి పార్వతికి పలక చూపించాడు కొన్ని తప్పులు సరిదిద్ది ఏదో కొంత బోధించింది పార్వతి. కొన్ని మాటలు తప్పులు లేకుండా వ్రాసి చూపించాడు.

"అమ్మా! నాకు ఇంగ్లీషు నేర్పమ్మా!"

"నాకు ఇంగ్లీషు రాదునాన్నా!" తల నిమురుతూ అంది పార్వతి.

తొమ్మిదేళ్లలో యీ ఆప్యాయత నెన్నడూ అనుభవించలేదు గోపి. హద్దులు లేని ఆనందముతో నిండిపోయింది వాని హృదయం.

"ఏమమ్మా! నేను మంచి పిల్లవాణ్ణిఅవుతాను. అతుంటరి పిల్లలతో యిక ఎప్పుడూ ఆడుకోను. అంటూ చాపపై నిద్రపోయాడు కలలు కంటూ.

మూడవరోజు పార్వతికొరకు ఎదురు చూస్తూ కూర్చున్నారు యిద్దరూ సత్రంలో, ఆరోజు భోజనాల తరువాత గోపి.

"తప్పకుండా దేవుడు పక్షపాతేనమ్మా! ఎంతో మందికి బిడ్డల నిచ్చినపుడు నీకెందు కివ్వకూడదు.? దేవుడికి దయలేదమ్మా!" అన్నాడు పార్వతి పక్కన కూర్చొని.

"అలా అనకూడదు. తప్పుకదూ! బాబూ! దేవుడు మనపై కోపపడుతాడు నాన్నా!"అంది గోపి నోరుమూస్తూ పార్వతి.

మూడు రోజుల నుండి తడిబట్టలతో వుండటము వలన సన్నగా వళ్లు వేడిచేసింది. ఆ రాత్రంతా శేఖర్, గోపి పార్వతి ప్రక్కన కూర్చున్నారు. నొప్పి తగ్గుతుందేమోనని చిన్ని చేతులతో తల, కాళ్ళు పిసుగుతున్నాడు గోపి అనుకోకుండానే ఏడ్పు వచ్చింది గోపికి.

"అమ్మా! యింకెప్పుడూ దేవుణ్ణి తిట్టనమ్మా! నేను తిట్టినందుకేగా నీకు జ్వరం వచ్చింది. నేనెంత చెడ్డవాణ్ణమ్మా! రేపు గుడికి వెళ్లి నీ జ్వరం తగ్గించమని మొక్కుతా దేవునికి" అంటూ ఏడ్చాడు.

"ఛా! ఏడ్వకూడదు బాబూ! దేవుడు ఎప్పుడు నీలాటి అమాయకులపై కోపపడడు బాబూ! చల్లనీళ్లతో తడిశా! అందుకే జ్వరం వచ్చింది. ప్రొద్దుటికంతా తగ్గుతుందిలే. అంటూ కన్నీరు తుడిచింది.

ఉదయము కాగానే డాక్టర్ని పిలుచుకు వచ్చాడు శేఖర్. ఒక యింజక్షన్ యిచ్చి సాయంత్రానికల్లా తగ్గిపోతుందని ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు డాక్టరు.

సత్రంలో అందరికీ తెలిసిపోయిందీవిషయము. పరామర్శించేందుకు ఆ గది దగ్గరకు అందరూ చేరారు. వారిలో ఆరోజే వచ్చిన ఎవరో క్రొత్తవ్యక్తి ముందుకు వచ్చి "చూడండి మీ చన్నీళ్ల స్నానాలెంతకు తెచ్చాయో? ఇప్పటి కన్నా అర్థమైందా యివన్నీ మూఢ నమ్మకాలని నిజంగా చూస్తే యీ నమ్మకాలన్నీ మన పాలిట శాపాలు. ఒక స్థలంలోని ఒక రాతిలోని దేవుడు యింకొక స్థలంలోని యింకో రాతి దేవుని కంటే ఎక్కువా? మీరు కోరినవన్నీ యిస్తే గారడివాడనుకున్నారా? దేవుడు. గాలిలో దీపం పెట్టి ఆరిపోకుండా వుంచమని ప్రార్థించండి దేవుణ్ణి వుంచుతాడా? యీరాతిని మనిషిగా మార్చమని వ్రతాలు చేయండి— మారుస్తాడా? ఇటువంటివి అసాధ్యమంటారు. అయితే మీ కోరికలలా కావా? దేవుని వ్యాపారమింకేమీ లేదనుకున్నారా? యిక యిలా అందరు అడిగినదాన్నల్లా యిస్తూ పోతుంటే చెప్పండి ప్రపంచంలో ఒక్కడూ బీదవాడుగా వుండడు. ఒక్కతీ విధవగాదు. ఎవరూ రోగ గ్రస్థుడు కాడు. గొడ్రాళ్లంటూ వుండరు. ఒక్కరూ చచ్చిపోరు. అయినా మిస్టర్ శేఖర్ గారూ! ఒక్క విషయము అడుగుతా చెప్పండి మీవిషయాల్లో అనవసరంగా దేవుని పేరు ఎందుకు నాశనము చేస్తారు. మీరిద్దరూ ఎప్పుడైనా డాక్టరు దగ్గర పరీక్ష చేయించుకున్నారా? అనర్గళంగా చెప్పాడు.

"లేదండి అన్నాడు శేఖర్.

"చాలా తప్పు చేశారు మిస్టర్! యీవిధంగా చేస్తూ యిప్పటికే నూర్ల కొద్ది డబ్బు యీ యాత్రలనీ, యోగులని, వ్రతాలని, వ్యర్థమైన వాటిపై ఖర్చుపెట్టారనుకుంటా. యీ తరహాలో వేలు తగలెయ్యటానికి మీకు మనసు ఒప్పుతుందిగాని ఏ స్పెషల్ డాక్టరు దగ్గరో పరీక్ష చేయించుకునేందుకు బుద్ధి పుట్టదు. మీ హృదయంలోనే భగవంతుణ్ణి వెతుకుతూ దేశాన్నంతా గాలిస్తున్నారు. ఒక చిన్న ఆపరేషన్‌తో సమకూరే పనులకు యీవిధంగా తిరుగుతున్నారన్న మాట. మిస్టర్ శేఖర్! మీరేమైనా అనుకోండి నాసలహా నేనిస్తాను. తక్షణము మీరిద్దరు వెళ్లి డాక్టరు పరీక్ష చేయించుకోండి. ఏదో చిన్న చికిత్సో, ఆపరేషనో మీ కోర్కెను తీరుస్తుంది. ఒక వేళ అదీ మీకు వ్యతిరేకమైతే ధైర్యంగా పరిస్థితుల నెదుర్కొండి. అంతేగాని అసాధ్యాలను ప్రసాదించమంటూ దేవుని వెంటపడకండి యిదే నాస్నేహ పూర్వక సలహా శేఖర్ గారు.

ఆ మిత్రుడు వెళ్లిపోయేసరికి ఒక పెద్ద గాలి వాన వచ్చి వెలసిపోయినట్లనిపించింది. అతడి మాటలన్నీ వ్యర్థమయ్యాయి శేఖర్ హృదయంపై. "అయినా ఒకసారి డాక్టరు పరీక్ష చేయించుకుంటే పోయిందేముంది.? అనుకున్నారిద్దరూ. ఆరోజు సాయంత్రం ఇంగ్లండు రిటర్నుడు అయిన ఒక లేడి స్పెషలిస్టు దగ్గరకు వెళ్లారు. డాక్టరు శ్రద్ధగా పరీక్షించి శేఖరును మరురోజు ఉదయము రమ్మంది. ఉదయము వెళ్లాడు శేఖర్. పార్వతీ గోపీలు ఎదురు చూస్తూ కూర్చున్నారు సత్రంలో. ఒక గంటలో తిరిగి వచ్చారు. శేఖర్ వాడిపోయిన ముఖం చూచేసరికి పార్వతి హృదయంలో అగ్ని పర్వతం ప్రబద్దలైనట్లయింది.

"ఏమండీ! ఆపరేషనుకు గూడ.........." అంటూ దు:ఖం పట్టజాలక శేఖర్‌పై వాలిపోయింది పార్వతి.

"లేదు పార్వతి ఒక నిట్టూర్పు విడిచాడు శేఖర్. "నీకసలు గర్భమయ్యే సూచనలే లేవట"

"అయితే నేను గొడ్రాలినన్నమాట" అంటూ కుప్పగా కూలిపోయింది. "అమ్మా!" అంటూ ఓదార్చాడు గోపి. "బాబూ! తనహృదయానికి హత్తుకొసాగింది. గోపీని. జెర్‌సొప్పా నయాగరా జలపాతాలు, హిమాలయపర్వతాలు, సింధు భాగీరథీనదులు పిట్లకిమల్లే తల్లిప్రేమ అగాధము, అచంచలము, అనిర్వచనీయము. మాతృహృదయ ఆరాటము పడితే, తపిస్తే నక్షత్రమండలం కూలిపోతుంది. సముద్రాలుపొంగి లోకాన్నిముంచివేస్తాయి.భూమివిడిపోయిలోకాల్నిమింగివేస్తుంది.

ఇంతలో అందరూ వచ్చారు. "అయినా యిదెక్కడి చోద్యమమ్మా? ఈ ఇంగ్లీషు చదువుల్లో తేలిపోతున్న ఈ డాక్టర్లకేం తెలుస్తుంది, మన దేవుళ్ళ, వారి మహిమ? ఈ పుణ్యస్థలాలు, దేవాలయాలు కట్టించేందుకు మనపూర్వికులేం పిచ్చివాళ్లా? యాత్రలూ, అవీచేయమని మన వాళ్లుచెప్పేది, ఏం డబ్బుపోగొట్టుకుని మోసపోమ్మనేనా? అయితే లక్షలాదిజనం ఈ దేవుళ్లను ఎందుకు పూజిస్తున్నారు? వీళ్ళంతా వెధవలా, మూర్ఖులా?నిజమైనభక్తిపరులకుఎన్నికోర్కెలు సఫలం కావటం చూడటం లేదు మనం? సర్వశక్తివంతునికి, సర్వవ్యాపితునికీ ఏదమ్మా అసాధ్యం? ఇంతటితో నిరాశ చెందకండి. పాపం! మీ యాత్రలు సాగించండి. ప్రయాగకు వెళ్లి త్రివేణిసంగమంలో స్నానం చేసి పునీతులుకండి. వారణాసి సర్వేశ్వరుణ్ణి దర్శించికొని సాఫల్యం పొందండి. ఋషీకేశం, బదరీనాథ్‌కు వెళ్లండి. అఖండజ్యోతిని ఆరాధించండి. తప్పకుండా మీకు సంతానమవుతుంది. అని చెప్పారు అక్కడ గుమిగూడిన వారంతా.

పార్వతి దు:ఖం కొంతవరకు ఉపశమించింది. ఎంతో ఆశగా వారి మాటలన్నీ వింటున్నారు దంపతులు. ఇంతలో ఒక ముసలామె తనకొడుకును పిలుచుక వచ్చి, "చూడమ్మా! పార్వతీ! వీడు నాకు ఆ బదరీనారాయణస్వామి కృపవల్లే కలిగి పద్దెనిమిదేళ్ళవాడయాడు. దేవుని ఆశీస్సులు పొందేందుకు రేపు వీనితోసహా అందరంవెళుతున్నాం బదరీకి. వస్తే మీరూ రండి. మా వెంట"అంది.

తను జీవిత దు:ఖాంధకారంలో ఒక ఆశాకిరణం జనించింది., రానురాను అదే పెద్దకాంతి పుంజంగా మారింది.

ఆ రాత్రిగోపి హాయిగా నిద్రపోతూవుంటే యిద్దరూ బదరీనాథుని కథలు వింటూ అనంతాకాశంలోకి మౌనంగా చూస్తూ కూర్చున్నారు. మంరొక్కసారి వారిభక్తి, ఆశల తరంగాలు హృదయపుటంచులను పెల్లుబికి ప్రవహించాయి. మరుదినము వెళ్లేవాళ్లతోబాటు తామూ వెళ్లాలని నిశ్చయించుకున్నారిరువురూ.

అకస్మాత్తుగా వాళ్ళకొక సమస్య ఎదురైంది. ఇరువురి దయాభిక్షలో గాఢనమ్మకమున్నగోపిని ఏం చేయాలి? గోపి అమాయక, ముసి ముసి నవ్వులు చిందే ముఖం చూస్తూ, చూస్తూ ఏం చేయాలి? బదరీయాత్ర చాల దూరము, కష్టమైనది. అక్కడికివాణ్ణితీసికవెళ్లే ప్రశ్నేరాదు. అయితే అలా విడిచిపెట్టిపోతే వానిగతేం కావాలి? పిల్లలతో కొట్లాడుతున్నపుడల్లా, ఎవరువాణ్ణి రక్షించేది? సిగరెట్లు త్రాగుతున్నపుడల్లా, ఎవరు వాణ్ణి "తప్పుబాబూ!" అని నచ్చజెప్పాలి? మురికి చేతులతో అన్నంతింటున్నపుడల్లా, "చేయికడుక్కో

గోపీ!" అని ఎవరు పిలవాలి? చిరిగిన చొక్కా వేసుకొన్నా, అమ్మా! నేనందంగా లేనా!" అంటే ఎవరిహృదయాల్లో ఆనందం పొంగి కట్టలు తెంచుకొని పారాలి? దొంగ ప్రయాణాల్లో టి.టి.ఐ. ల నిర్దాక్షిణ్య ప్రవర్తనలనుంచి ఎవరు రక్షించాలి. అబద్ధం ఆడి, "అమ్మా! ఈ ఒక్కసారి క్షమించవూ" అంటూన్న ఆ యాచ్ఞనయనాలను చూస్తే ఎవరి హృదయాలు తపించిపోవాలి?

అయినా గత్యంతరం లేదు. విడిచిపెట్టి పోవలసిందే. ఇన్నిరోజులు దేవుడు కాపాడుతూ వచ్చాడు. ఇకముందు అతడే దిక్కు. తప్పదు! పరిస్థితులనెదుర్కొనవలసిందే!! "జీవితమే ఒక ప్రయాణములాంటిది. తండ్రులూ, కొడుకులూ అందరూ ప్రయాణికులే. ఈ ప్రయాణంలో కలయికలు, విడిపోవటాలు సహజమే, నన్నవేదాంతంలో పడ్డారిరువురూ. ఒకవేళ ఈ విషయం గోపికి తెలిస్తే పార్వతి కొంగువిడవడు. చివరికి ఇద్దరూ ఒకనిర్ణయానికి వచ్చారు. తప్పించుకునే మార్గం వెతుకుతున్నంతసేపు ఏదో కుట్ర పన్నుతున్న హంతకుల్లాగ బాధపడ్డారిరువురూ.

• • •

ఉదయము ఇద్దరూ గోపీకళ్లల్లోకిసూటిగా చూడలేకపోయారు. గోపీచేతిలో ఐదురూపాయలు నోటుపెడుతూ దూరంగా ఉన్న బజారుపేరు చెప్పి ఒకవిష్ణుపటం తెమ్మనిచెప్పాడు శేఖరం. ఎలాంటి మాయ, మర్మము కనిపించలేదు గోపికి. తనకిన్నాళ్లకు ఒక తల్లిదొరికిందికదాయని ఉబ్బిపోయాడు. సూర్యుడు తూర్పున ఎంత నిశ్చింతగా ఉదయిస్తాడో అంతనిశ్చయంగా తనకొరకువేచి ఉంటారనుకొన్నాడు పార్వతీ శేఖరులు, తన అమ్మ, చిన్నాన్న! ఏదోసినిమాలో పాటపాడుకుంటూ హుషారుగా పరుగెత్తాడు వీధిలోకి.

గోపీ కనబడకుండా పోయేవరకు చూస్తూ నిలబడింది పార్వతి నిశ్చల నిరీహ, నీరస నిర్నిమేష నేత్రాలతో. టపటపా కన్నీళ్లు కారాయి. 'పినతల్లి చేతిలోనైనాబెట్టిపోమన్నావు మమ్ము!' అన్న కుంతిలాగ వాపోయింది.

శేఖరును అడిగి రెండు పదిరూపాయలనోట్లు తీసికొని గోపీపాతనిక్కరులో పెట్టి, అంగీనికరు మూటగా చుట్టింది. శేఖరు ఆ మూటతీసికెళ్లి ప్రక్కరూములో వాళ్ళకు ఇచ్చి గోపీవస్తే ఇవ్వమనిచెప్పివచ్చాడు. త్వరత్వరగా తమ సామాన్లన్నీ తీసికొని బదరీకివెళ్లేముసలిదంపతులతో బాటుస్టేషనుకు వెళ్ళిపోయారు. వాళ్ళటు వెళ్ళగానే ప్రక్కరూము అతనుమూటవిప్పి ఆ ఇరవై రూపాయలు తనజేబులో పెట్టుకొని యథాప్రకారంగా చుట్టాడుబట్టల్ని.

గోపీ తిరిగివచ్చి ఖాళీగదిని చూశాడు. ప్రక్కరూము అతను బట్టల్ని తెచ్చియిచ్చాడు.

"మా అమ్మ, చిన్నాన్న ఎక్కడ?" అడిగాడు గోపి.

"వెళ్ళిపోయారు."

"ఎక్కడికి

రైల్వేస్టేషనుకు"

"స్టేషనుకా? నేనురాకుండానే?" విష్ణుపటాన్నినేలపై గిరవాటువేసి ఏడ్చుతూ స్టేషనుకు పరుగెత్తాడు.

ప్లాటుఫారంపైవున్న జనాన్నంతా త్రోసికుంటూ వెళ్లాడు. కాని లాభంలేక పోయింది. రైలు అప్పుడే వేగంగా స్టేషను దాటుతూవుంది "అమ్మా, చిన్నాన్నా!" అంటూ పడిపోయాడు. ప్లాటుఫారంపై. ఇద్దరుపోలీసువాళ్ళు పోలీసుస్టేషనుకుపిలుచుకెళ్లారు. ఓదార్చేందుకు ఇన్‌స్పెక్టరుఎంతో ప్రయత్నించాడు. "ఊరుకో బాబూ! మీ అమ్మ, నాన్నదగ్గరికి పిలుచుకెళ్తా. సరేనా! వాళ్ళ పేర్లుచెప్పువాన్నా!" అంటూ బుజ్జగించారు. గోపి ఏడ్చాడు. ఇంకా ఏడ్చాడు. ఎంతఓదార్చినా లాభం లేకపోయింది. చివరికి, పేర్లుచెప్పకుంటే జైలులో వేస్తానని బెదరించాడు. ఏమనిచెబుతాడు పేర్లు? వాడిదృష్టిలో పార్వతి, శేఖరులు "అమ్మ" చిన్నాన్న" అంతే! పోలీసువాళ్లలాఠీలతో బెదరించే సరికి ఏడుస్తూ మొదటినుంచీఅంతా చెప్పాడు. వింటున్నవాళ్లంతా హేళనగా నవ్వాపుకోలేకపోయారు.

రాస్కెల్! ఇదా నీకథ? కనబడిన జంటనల్లా నీ తల్లిదండ్రులను చేసుకోవటమే? అసలు నిన్ను వదిలించుకుపోవాలనేవాళ్ళీ పని చేశారు" అంటూ గోపిని ఎత్తుకెళ్ళి వీధిలోకి పడెయ్యమన్నాడు. ఇనెస్పెక్టరు, మన ప్రభుత్వోద్యోగి, రాతిబొమ్మ! ఇక ఆజ్ఞను పాలించారు. స్వామిసేవకులు. క్రింద పడవేయగానేలేచి "అమ్మా, "చిన్నాన్న, అమ్మా, చిన్నాన్న అమ్మా!" అంటూ వీధుల్లోకి పరుగెత్తాడు గోపి.

ఇంతవరకూ ఇతరయేదేవుళ్ళు ప్రసాదించని సంతానాన్ని బదరినారాయణుడు బహుశ పార్వతికి కలుగజేస్తాడేమో!!!

★



# పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము. వి. పి. గా పంపగలము. వి. పి.చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా మండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**

